క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

టంగుటూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ పటాపంజుల కొటేశ్వరమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహిస్తామని ఎంపీడీవో రత్నజ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వ సభ్య సమావేశానికి హాజరయ్యే అధికారులు పూర్తి సమాచారంతో రావాలన్నారు. అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు వల్లూరమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు

టంగుటూరు: జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్న ఆలయ కార్యనిర్వాహణాధికారి రమేష్ తెలిపారు. ఈఓ మాట్లాడుతూ హుండీ లెక్కింపు ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, పోలీసు, బ్యాంకు అధికారుల సమక్షంలో నిర్వహిస్తామన్నారు.

చవితి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న హరిబాబు

జరుగుమల్లి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా జరుగుమల్లి ఉశ్కేరమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకునికి గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు జరుగుమల్లి మాజీ సర్పంచి గడియపూడి హరిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు, నాయకులు దుంపా అనిల్ కుమార్ రెడ్డి, కొండూరి హర్షవర్ధన రెడ్డి, మారెడ్డి సుబ్బారెడ్డి, అముదాలపల్లి శ్రీనివాసరావు, కుప్పాల శ్రీనివాసరావు, యల్‌వీయస్ నాయుడు, కళ్ళగుంట బార్గవ్, కలికివాయి రాజశేఖర్, కలికివాయి శివ పలువురు భక్తులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లి ఆలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న భక్తులు

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లికి భక్తుల నుంచి విరాళాలు అందుతూనే ఉన్నాయి. పట్టణానికి చెందిన పరిమి నాగేంద్ర బాబు, రఘురాంలు గురువారం అమ్మవారికి రూ.31,116 విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. అమ్మవారిపై అంచలమైన భక్తి, విశ్వాసాలతో భక్తుల నుంచి విరాళాలు అందుతూనే ఉన్నాయని, భక్తుల మనోభావాలకు అనుగుణంగా అమ్మవారి ఆలయం అభివృద్ధి జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, ఆవుల మాధవరావు, మాదాలా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న కాల భైరవ పూజలు


ప్రత్యేక అలంకరణలో కాల భైరవ స్వామి

జరుగుమల్లి: మండలంలోని కె.బిట్రగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న కాల భైరవ దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకులు ఆంజనేయులు అభిషేకాల అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీ ప్రసన్న కాల భైరవ స్వామికి అభిషేకం, గణపతి పూజ, మహాలక్ష్మి పూజ అనంతరం దేవాలయ ప్రాంగణంలో కాల భైరవ శాంతి హోమం వేద పండితులతో నిర్వహించారు.

రోగులకు పాలు, పండ్లు పంపిణీ


వైద్యశాలలో డాక్టర్ వెంకయ్య చేతుల మీదుగా పండ్లు పంపిణీ

ఉలవపాడు: మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా స్థానిక రిజర్వుకాలనీలోని మసీదు సభ్యులు గురువారం వైద్యశాలలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. స్థానిక శ్రీశ్రీ వైద్యశాల, ప్రభుత్వ వైద్యశాలలో వీటిని అందించారు. శ్రీశ్రీ వైద్యశాలలో వైద్యులు వెంకయ్య, ప్రభుత్వ వైద్యశాలలో సూపరింటెండెంట్ ఐశ్వర్య చేతుల మీదుగా అందించారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సభ్యులు మాబాషా, దస్తగిరి, సుల్తాన్‌బాషా, గౌస్‌బాషా, జిలానీ, షరీఫ్, షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

జాషువా సాహిత్యం అజరామం

కందుకూరు: మహాకవి గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. తెలుగు సాహిత్యంలో గుర్రం జాషువాది ప్రత్యేక స్థానమని, సమాజంలోని రుగ్మతలపై తన సాహిత్యం ద్వారా పోరాడిన మహాకవి అని కొనియాడారు. జాషువా అందించిన సాహిత్యం అజరామమని, సమాజ చైతన్యం కోసం, మూఢనమ్మకాలను పోగొట్టేందుకు ఆయన తన కవిత్వం ద్వారా ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ, ఏఎంసీ మాజీ చైర్మన్ తోకల కొండయ్య, రేణమాల అయ్యన్న, మహేష్, చనమాల రామరావు, శివ, ఆదిలక్ష్మీ, పబ్బిశెట్టి శ్రీకాంత్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గుర్రం జాషువా జయంతి సభ

మహాకవి గుర్రం జాషువా జయంతి సభను శుక్రవారం సాయంత్రం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు మాదిగ ఉద్యోగుల సమైఖ్య జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజాక్ తెలిపారు. సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, ప్రధానవక్తగా ఉస్మానియా యూనివర్సిటీతెలుగుశాఖ అధ్యక్షుడు చింతకింది కాశిం, విశిష్ట అతిథులుగా ప్రముఖ ఇన్‌కంట్యాక్స్ ఆఫీసర్ కురుకుంట్ల సెల్వరాజు, ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

కందుకూరు రూరల్: గుర్రం జాషువా 128వ జయంతి సభ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు మాదిగ ఉద్యోగుల సమైఖ్య జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజాక్ తెలిపారు. ఈ సభకు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. అదే విధంగా ప్రధాన వక్తగా ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు, ప్రొఫెసర్ చింతకింది కాశీం పాల్గొంటారన్నారు. మండలంలోని పందలపాడులో మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు వర్ల దేవదాసు మాదిగ, మాదిగ ఉద్యోగుల సమైఖ్య డివిజన్ అధ్యక్షులు జడ రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ గొడపేరు కాంతరావు జాషువా జయంతి సభ కరపత్రాలు ఆవిష్కరించారు.


జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: సమాజంలోని అంటరానితనం, మూఢనమ్మకాలపై తన కలాన్ని ఎక్కుపెట్టిన విశ్వనరుడు గుర్రం జాషువా అని పలువురు సాహితీవేత్తలు అన్నారు. జాషువా జయంతి సభ జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంస్థ కార్యదర్శి చనమాల కోటేశ్వరరావు, ముప్పవరపు కిశోర్, వీవీ శేషయ్య, రావులకొల్లు బ్రహ్మానందం, గేరా చిరంజీవి, ఇనకొల్లు మస్తానయ్య, పోకూరి మాలకొండయ్య, ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, ముప్పవరపు రమేష్, షేక్ మహబూబ్‌బాషా తదితరులు

కనిగిరి రూరల్: తన కవిత్వాలు, రచనలతో సమాజాన్ని చైతన్యంలో గర్జించిన నవయుగ కవి గుర్రం జాషువా అని పలువురు నాయకులు అన్నారు. గుర్రం జాషువా జయంతి వేడుకలను కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఉన్న జాషువా విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, చింతంగుంట్ల సాల్మన్ లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రంగనాయకులరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ మానవ సమానత్వం గూర్చి చాటి చెప్పిన గొప్ప కవి గుర్రం జాషువా అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు జి.రవికుమార్, డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, పార్టీ జేసీఎస్ కన్వీనర్ వేల్పుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


కనిగిరిలో జాషువాకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కందుకూరులో జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీకారులు

గణనాథునికి ఘన వీడ్కోలు


వెలిగండ్లలో గణనాథున్ని ఊరేగిస్తున్న భక్తులు

వెలిగండ్ల: మండలంలోని వెలిగండ్ల, జిళ్లెళ్లపాడు గ్రామాల్లో వినాయకుని నిమర్జన వైభవంగా నిర్వహించారు. గణనాథునికి 11 రోజులు పాటు వైభవంగా పూజలు నిర్వహించారు. లడ్డు పాట నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): సకల గణాధిపతి గణేషుని నిమజ్జనోత్సవం మండలంలోని రెడ్డిగారి కొత్తపల్లెలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఈనెల 18వ తేదీన ప్రత్యేక పందిళ్లలో వినాయక విగ్రహాలను ఏర్పాటుచేసిన భక్తులు 11 రోజులపాటు పూజలు నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా ఆఖరినాడు విగ్రహాలవద్ద కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


కొత్తపల్లెలో వినాయక నిమజ్జనం

ఘనంగా మీలాద్ ఉన్ నబీ వేడుకలు

కనిగిరి రూరల్: మీలాద్- ఉన్- నబీ (మహమ్మద్ ప్రవక్త జన్మదినం) వేడుకలను గురువారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. కేఎస్‌ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక 13వ వార్డు మంగళిమాన్యంలోని మదరసా విద్యార్థులకు, పేదలకు బియ్యం, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా థెరిస్సా సేవాసమితి అధ్యక్షుడు ఎస్ ఎన్ రసూల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కేఎస్‌ఎం ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ అల్లాహ్ కృపతో సర్వ మానావళి సుఖ సంతోషాలతో జీవించాలన్నారు. మహమ్మద్ ప్రవక్త చూపిన సన్మార్గం ఆచరణీయమన్నారు. క్షమ, దయాగుణం, సత్ ప్రవర్తన. తోటి వారికి ఉన్నంతలో సాయం చేయాలనే ప్రవక్త బోధనలు అనుసరణీయమన్నారు. సమాజాన్ని ప్రేమించాలి, గౌరవించాలి.. నీతిని, న్యాయాన్ని విస్మరించకూడదు, వృద్ధులను, అనాథలను ఆదరించాలి, తల్లి దండ్రులకు సేవ చేయాలి, వారి పట్ల విధేయతగా ఉండాలి, నిస్సహాయులకు తమ వంతు సాయం చేయాలనే ఉన్నత బోధనలు చేసిన మహమ్మద్ ప్రవక్త గొప్ప ఆదర్శనీయుడని కీర్తించారు. విశ్రాంత ఎంఈఓ ఎస్‌కే మస్తాన్ వలి మాట్లాడుతూ మానవీయ విలువలను ప్రతి ఒక్కరు పాటించాలని, మంచి సమాజంలో అందరూ భాగస్వామ్యులు కావాలనే మంచి సందేశాన్ని మానావాళికి చాటిన మహమ్మద్ ప్రవక్త మహోన్నతుడని కొనియాడారు. తొలుత మౌలానా ఆహమ్మద్ అలీ, హాఫీజ్ హమీద్, యాసీన్‌లు ప్రవక్త బోధనలను వివరించారు. అనంతరం మదరసా విద్యార్థులు ప్రత్యేక దువా చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సయ్యద్ రిజ్వాన ఖాలక్, వైఎస్సార్‌సీపీ పట్టణ యూత్ అధ్యక్షుడు డాక్టర్ రసూల్, ఈద్గా కమిటీ ఉపాధ్యక్షుడు మస్తాన్ వలి, రహిమాన్, థెరిస్సా సేవా సమితి నాయకులు పి అరుణోదర్, ఎస్‌కే నాయబ్ రసూల్, ద్రోణాదుల చెంచులు, ఎల్ఐసీ నారాయణ, కేతన బోయిన పెద్దన్న, ఇమామ్, నాగూర్‌బీ, భారతీ, మాజీ ఏఎంసీ డైరక్టర్ బొట్టు శ్రీను, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు మన్సూర్, సయ్యద్ నాయబా, ఎస్‌కే అబ్దుల్ సమద్, సయ్యద్ నూర్, ఎస్‌కే నాయబా, ఖాజావలి, ముస్లిం మత పెద్దలు, మదరసా నిర్వాహకులు పాల్గొన్నారు.


బియ్యం, స్వీట్లు పంపిణీ చేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్, థెరిస్సా కమిటీ నాయకులు


ప్రత్యేక దువాలో చైర్మన్ అబ్దుల్ గఫార్, ముస్లిం పెద్దలు

నూకతోటి ప్రసాద్ ధన్యజీవి

కందుకూరు రూరల్: నూకతోటి ప్రసాద్ ధన్యజీవి అని కందుకూరు డిప్యూటీ డీఈఓ ఏ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యతంలో మృతి చెందిన ఎంఈఓ నూకతోటి ప్రసాద్ సంస్మరణ సభ స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బీటీఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రసాద్ మంచి ఉపాధ్యాయునిగా మంచి అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేశారన్నారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లం వేణుగోపాల్, బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లగుంట మోహన్‌రావు, ఆదినారాయణ, లక్ష్మయ్య, చిన్న వెంగయ్య, రఘు, మేడికొండ భాస్కర్, దార్ల కోటేశ్వరరావు, కట్టా రమేష్, నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టేటు రమేష్, సంగ మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ డీఈఓ, బీటీఏ నాయకులు

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

సీఎస్‌పురం (పామూరు): బాల్యవివాహాలు ఆరోగ్యానికి హానికరమని, చట్టరీత్యా నేరమని వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్.బజాజ్‌బుజ్జి అన్నారు. మండలంలోని శీలంవారిపల్లెలో గురువారం బాల్యవివాహాలవల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. వివాహ వయస్సు బాలికలకు 18 ఏళ్లు, పురుషులకు 21 ఏళ్లు నిండాలన్నారు. నిర్దేశిత వయసు కన్నా వయస్సు తక్కువవారికి వివాహం చేస్తే అటు జైలు శిక్షతో పాటు, జరిమానా విధిస్తామన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు లేదా 1098 హెల్ప్‌లైన్ నంబర్‌కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రమాదేవి, సుగుణ, బాబూరావు, మునగల నారాయణరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

పామూరు: నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సయ్యద్ మౌలాలి పేర్కొన్నారు. భగత్‌సింగ్ 117వ జయంతి సందర్భంగా గురువారం స్థానిక కందుకూరురోడ్డులో సీపీఐ నియోజకవర్గ సహాయకార్యదర్శి వజ్రాల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భగత్‌సింగ్ విగ్రహానికి పలువురు నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా భగత్‌సింగ్ స్ఫూర్తితో నేటి యువత పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. చిన్న వయస్సులోనే దేశంకోసం ప్రాణాలు పణంగా పెట్టి భగత్‌సింగ్ పోరాటాలు చేశాడన్నారు. యువతకు స్ఫూర్తి ప్రదాత భగత్ సింగ్ అని, స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారితో పోట్లాడి అశువులు బాసిన త్యాగమూర్తి భగత్‌సింగ్ అన్నారు. కార్యక్రమంలో పాలపర్తి మస్తాన్‌రావు, రాగిపాటి సూరిబాబు, ఆకుల మోహన్‌రావు, షేక్.సింగనపల్లి రఫి, ఇండ్ల నరసింహారావు, ఇర్రి వెంకటరెడ్డి, అబ్బిశెట్టి, ప్రసాదు పాల్గొన్నారు.


భగత్‌సింగ్ విగ్రహంవద్ద నివాళులర్పిస్తున్న నేతలు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఎం.బాజీబాబు తెలిపారు. మండలంలోని ముత్యాలపాడు గ్రామం వద్ద ఉన్న ఉప్పుటేరు నుంచి గురువారం సాయంత్రం ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం తెలియడంతో సిబ్బందితో వెళ్లి ముత్యాలపాడు వద్ద ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాజీబాబు పేర్కొన్నారు.

ఉచితంగా వైద్య పరీక్షలు


పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉలవపాడు: స్థానిక సీహెచ్‌సీ వైద్యశాల ఆవరణలో ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కందుకూరు ఏరియా వైద్యశాల వైద్యులు ధర్మతేజ జనరల్ సర్జరీకి సంబంధించి వ్యాధులపై పరీక్షలు జరిపారు. హెర్నియా, దీర్ఘకాలిక గాయాలు, ఆపరేషన్లకు సంబంధించిన రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. వైద్యాధికారి ఐశ్వర్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

మర్రిపూడి: జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ,యువకులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, లైవ్‌స్టాక్ మిషన్ కింద ఈ నెల 30న ఒంగోలులో ఉచితంగా ట్రెనింగ్ ఇస్తామని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి. వెంకటసుబ్బయ్య సూచించారు. స్థానిక పశు వైద్యశాలలో గురువారం ఆయన పశువైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి టీకాలు వేయించాలన్నారు. మర్రిపూడి పశువైద్యాధికారి శ్రావణి, ఏహెచ్‌సీ, పారా, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ వెంకట సుబ్బయ్య

ఓటర్ జాబితాల పరిశీలన

ఒంగోలు సెంట్రల్: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా కార్యదర్శి తీగల సత్యవతి కోరారు. ఒంగోలులోని చంద్రయ్యనగర్‌లో పార్టీ నగర అధ్యక్షుడు మనోజ్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. మండలంలో శక్తి కేంద్రాలు, బూత్ కమిటీలు ఓటర్ జాబితాల పరిశీలన, తదితర అంశాలపై నాయకులు అనుసరించిన విధివిధానాలపై చర్చించారు. తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఖలీఫాతుల్లాబాషా, రాష్ట్ర మహిళా నాయకురాలు మీనాకుమారి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భోజనం అందజేత

కొత్తపట్నం : మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం పేదలు, భిక్షాటన చేసే వృద్ధులు, అనాథలు, అంధులు, వికలాంగులకు భోజనాలు పంపిణీ చేశారు. దాతలు డాక్టర్ దారా చెన్నకేశవ ప్రాణహిత గార్ల కుమారుడు విరజ్ కేశవ్ రెండో పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ డి.కేశవ, తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలి

పామూరు: విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ తిరివీధి చెన్నకృష్ణ అన్నారు. స్థానిక కేజీబీవి పాఠశాలలో గురువారం జేవీవీ మండల కమిటీ ఆధ్వర్యంలో దేశభక్తి వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా కేజీబీవి ఎస్‌ఓ కటకం సజన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ చెన్నకృష్ణ విద్యార్థులకు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి మూఢనమ్మకాలను ఎలా దూరంగా ఉంచాలని వివరించారు. వి.మాలకొండారెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు ఎలా మెలగాలి వివరించడంతో పాటు చెకుముకి పరీక్షల ఆవశ్యకతను వివరించారు. అనంతరం ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్.స్వామినాథన్, జాషువా చిత్రపటాలవద్ద నివాళులర్పించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వెంకటేష్, వెంకట్రావు, అబ్దుల్, కే.శంకర్, భాను, పరిమళ, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ చెన్నకృష్ణ

పాస్ పుస్తకాల పంపిణీ పరిశీలన

- ఆరు రెవెన్యూ గ్రామాల్లో భూ రీ సర్వే పూర్తి
- 1647 మంది రైతులకు భూ హక్కు పత్రాలు

హనుమంతునిపాడు: భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జరగుతున్న భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని కొండారెడ్డిపల్లి, నీలకంఠాపురం, ముప్పళ్లపాడు గ్రామాల్లో తహసీల్దార్ గురువారం పరిశీలించారు. అనంతరం రైతులకు భూమి హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27 రెవెన్యూ గ్రామాల్లో జరుగుతున్న భూ రీసర్వే గాను 6 రెవెన్యూ గ్రామాల్లో పూర్తయిందన్నారు. మిగిలిన గ్రామాల్లో సర్వే జరుగుతుందని తెలిపారు. పూర్తయిన రెవెన్యూ గ్రామాలు కోటతిప్పలకు 276 మందికి, నీలకంఠాపురంలో 256 మందికి, ముప్పళ్లపాడులో 422 మంది రైతులకు, దాసళ్లపల్లిలో 317 మందికి, నల్లగండ్లలో 266 మందికి, మాసాయిపేటలో 150 మంది రైతులకు భూ హక్కు పత్రాలు వచ్చాయన్నారు. మొత్తం 1647 మంది రైతులకు పాస్‌పుస్తకాలు వచ్చాయి. వాటిని గ్రామాల్లో వీర్వోలు రైతులకు పంపిణీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు కాశీమ్ పీరా, బాదుర్ల, వెంకటనర్సయ్య, పురుషోత్తం చెన్నకేశవులు పాల్గొన్నారు.


పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి నగదు అందజేత

నాగులుప్పలపాడు : నాగులుప్పలపాడు కూడలిలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. గురువారం నాగులుప్పలపాడులో విగ్రహ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన.. నిర్వాహకులు విజయేంద్ర బహుజన్, గుంపుల సుబ్బారావు, కమిటీ సభ్యులకు నగదు అందజేశారు.

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలు

ఒంగోలు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద వైద్య సిబ్బంది గురువారం పలు గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ వాణి ఆధ్వర్యంలో గ్రామాల్లో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, సీహెచ్‌ఓలు ప్రతి ఇంటిని సందర్శించి ఆ కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలు, వారు తీసుకుంటున్న మందులు తదితర వివరాలు సేకరించారు. సుగర్, బీపీ వంటి పరీక్షలు నిర్వహించి వారికి ఏ తేదీన గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారనే దానిపై రసీదులు అందజేశారు. మరో ఏడు రోజుల పాటు సర్వే కొనసాగుతుందని వైద్యాధికారి వాణి తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జయశ్రీ, వైద్యారోగ్య శాఖ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.